ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
3★★★
శుక్రవారం 16 ఫిబ్రవరి 2024



ముగిసిన ప్రజాహిత యాత్ర 4
6 ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి

దొంగలున్నారు జాగ్రత్త...



- జిల్లాలో రెచ్చిపోతున్న దొంగలు
- తాళం వేస్తే సొమ్ము మాయం
- 45 రోజుల్లో 60కు పైగా దొంగతనాలు
- ప్రతి యేటా పెరుగుతున్న దోపిడీలు...

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

నిత్యం ఏదో ఒక చోట చోరీ లేని రోజంటూ గడవడం లేదు. జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. తాళం వేస్తే అందిన కాడికల్లా ఊడ్చుకెళ్తున్నారు. శుభకార్యాలు మొదలు కావడంతో కుటుంబసభ్యులు ఇళ్లకు తాళం వేసి వెళ్లడాన్ని టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్నారు. గడిచిన 45 రోజుల్లో జిల్లాలో 60కు పైగా దొంగతనాలు జరిగాయి. దీంతో ఇంటికి తాళం వేయాలంటేనే భయపడిపోతున్నారు. కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరు ప్రయాణాలు మానుకొని ఇంటికి కాపాలాగా ఉండిపోతున్నారు. ఎంతో కష్టపడి సంపాదించుకున్న డబ్బులు, బంగారం, వెండి వంటి విలువైన వస్తువులు దొంగతనాలు జరగడంతో మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. దీంతో పాటు జిల్లాలో చైన్ స్నాచింగ్‌లు, దోపిడీలు కూడా జరుగుతున్నాయి.

ప్రతీ సంవత్సరం జిల్లాలో నేరాల సంఖ్య పెరుగుతూనే ఉంది. 2022 సంవత్సరంలో దారి దోపిడీలు ఎనిమిది కేసులు నమోదు కాగా 2023లో 12 కేసులకు పెరిగింది. ఉదయం వేళల్లో తాళం వేసిన ఇళ్లలో చోరీలు 2022లో 15 నమోదు కాగా గత సంవత్సరం 18కి చేరుకుంది. రాత్రి దొంగతనాల్లో 2022లో 5 7 కేసులు నమోదు కాగా గత సంవత్సరం 105 కేసులు నమోదయ్యాయి. సాధారణ దొంగతనాలు 2022లో 90 ఉండగా గత సంవత్సరం 192కు పెరగడంతో ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. దీంతో పాటు సైబర్ నేరాలు కూడా పెరిగాయి. 2022లో 67 కేసులు ఉండగా గత సంవత్సరం 80కు పెరిగాయి. జిల్లాలో అన్ని రకాల కేసులు 2022లో 3,347 నమోదు కాగా గత సంవత్సరం 3,948కి పెరిగాయి.

● వరుస దొంగతనాల బీభత్సం

జిల్లాలో జనవరి నుంచి ఇప్పటి వరకు 60కు పైగా దొంగతనాలు జరిగాయి. బంగారం, వెండి, నగదు ఇతర వస్తువులకు సంబంధించి భారీగానే ప్రజలు నష్టపోయారు. బుధవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శ్రీనగర్ కాలనీలో రెండిళ్లలో కుటుంబ సభ్యులు శుభకార్యాలకు వెళ్లగా తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. వెండి వస్తువులతోపాటు ఒక ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లారు. దొంగతనం జరిగిన ఇంటి పైఅంతస్థులో సిరిసిలల్ల డీఎస్పీ అద్దెకు ఉండడంతో చర్చనీయాంశంగా మారింది. ఇంతకంటే రెండు రోజుల ముందు కోనరావుపేట మండలం శివంగాల పల్లి గ్రామంలో వరుసగా మూడిళ్లలో బొడ్డు దేవయ్య, జంగం లక్ష్మి, గూడూరు రేణుక ఇళ్లకు తాళం వేసి తమ బంధువు ల ఇంటికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొం గలు బొడ్డు దేవయ్య ఇంటిలో తాళం పగలగొట్టి 30 తులాల వెండి, జంగం లక్ష్మి ఇంటిలో తాళం పగల గొట్టి 20 తులాల వెండి, నగదు, గూడూరి రేణుక ఇంటి తాళం పగలగొట్టి నగదును ఎత్తుకెళ్లారు.

మంగళపల్లెలో నంది సిద్దవ్వ మెడలోంచి మూడు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. మర్తనపేటలో బోనాల నర్సయ్య ఇంట్లో ఐదు తులాల బంగారం, 20 తులాల వెండి, 25 వేల నగదు దోచుకెళ్లగా మరో ఇంట్లో రెండువేల నగదు పోయింది. రుద్రంగి మండల కేంద్రంలో సుద్దాల భూమయ్య ఇంట్లో దొంగలు పడ్డారు. విలువైన వస్తువులు పోలేదు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో లక్ష్మీనర్సింహ వైన్స్‌లో చోరీకి పాల్పడి 30 వేల రూపాయలు, సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. వెంకటాపూర్‌లోని శివాలయం, వేణుగోపాల స్వామి, దుర్గమ్మ, ఎల్లమ్మ, సాయిబాబా ఆలయాల్లో హుండీలను ధ్వంసం చేశారు. రూ. 40 వేల నగదు, ఇత్తడి లోహాలతో తయారు చేసిన ఉత్సవ విగ్రహాలను ఎత్తుకెళ్లారు. ఇల్లంతకుంట గాలిపెల్లి పెద్దమ్మ తల్లి ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. ముస్తాబాద్ మండల కేంద్రంలోని బిట్ల వెంకటేష్ ఇంట్లో రెండు తులాల బంగారం, 70 తులాల వెండి, రూ 40 వేల నగదు, చీకోడు ఎల్లమ్మ ఆలయంతో పాటు మరో కిరాణా దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. గంభీరావుపేట మండలం దేశాయిపేటలో ఫిరంగి దేవరాజు, జక్కుల బాలయ్య, ఇళ్లలో దొంగలు నాలుగు తులాల బంగారం నగదు ఎత్తుకెళ్లారు.

తంగళ్లపల్లి మండలంలోని ఓబులాపూర్‌లో ఒకే రోజు మూడు ఇళ్లలో చోరీ జరిగింది. బత్తుల నర్సయ్య ఇంట్లో ఐదు గ్రాముల బం గారం, 60 తులాల వెండి, 30 వేల నగదు, పోచంపల్లి బాలకిషన్ ఇంట్లో ఐదు గ్రాముల బంగారం, ఐదు తులాల వెండి, రూ 40 వేల నగదు, తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లో ఆంజనేయ శర్మ ఇంట్లో తులం బంగారం, కిలో వెండి, 50వేల నగదు, బాబాజీ కాలనీలో లింగమూర్తి ఇంట్లో నాలుగు తులాల బంగారం 40 వేల నగదు, మ్యాకల గంగారాం ఇంట్లో రూ. 60 వేల నగుదు ఎత్తుకెళ్లారు. ఇలా వరుసగా దొంగతనాలు జరుగుతుండడంతో జిల్లాలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు దొంగతనాలు జరిగిన తరువాత వేగంగా దర్యాప్తు చేస్తున్నా దొంగతనాలు ఆగడం లేదు. దొంగతనం కేసుల్లో జనవరి నుంచి ఇప్పటి వరకు 15 కేసులను పరిష్కరించారు.

● వామ్మో ఎండాకాలం...

సాధారణంగా ఎండాకాలం వస్తుందంటేనే దొంగల పట్ల ఆందోళన చెందుతారు. ఈ సారి ఎండల కంటే ముందే దొంగతనాలు మొదలయ్యాయని చర్చించుకుంటున్నారు. వేసవి సెలవులకు టూర్లకు వెళ్లడం, ఎండ వేడికి ఆరుబయట పడుకోవడంతో దొంగతనాలు జరుగుతుంటాయి. ఈ సారి మూడు నెలల పాటు మంచి ముహూర్తాలు ఉండడంతో శుభకార్యాలు కూడా ఎక్కువగానే జరగనున్నాయి. పోలీసులు మాత్రం అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. విలువైన వస్తువులు ఇంట్లో భద్రపరచకుండా బంగారం, నగలు లాకర్లో భద్రపర్చుకోవాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా ఉక్కపోతకు ఆరుబయట పడుకున్న సమయంలో మంగళసూత్రాలు తెంపుకొని పారిపోయే అవకాశాలు ఉన్నాయి. బస్సులు ఎక్కేటప్పుడు, రోడ్డుపై నడిచే సమయాల్లో చైన్ స్నాచింగ్‌లకు కూడా పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. ఇంటి తలుపులు, తాళాలు, సెంట్రల్ లాకింగ్‌సిస్టమ్ జాగ్రత్తగా చూసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. దీంతో పాటు బంగారు నగలకు మెరుగు పెడతామని కూడా మోసం చేస్తారని జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.



కోనరావుపేట మండలం శివంగళ్లపల్లిలో బీరువాను పగలగొట్టిన దొంగలు, డాగ్ స్క్వాడ్ తనిఖీలు, తంగళ్లపల్లిలో దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు, కోనరావుపేట మండలం మంగళ్లపల్లెలో విచారణ చేస్తున్న ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ నాగేంద్రచారి (ఫైల్)

గృహజ్యోతి పథకం కోసం ప్రత్యేక యాప్

- సెస్ చైర్మన్ చిక్కాల రామారావు



సెస్ పాలకవర్గ సమావేశంలో పాల్గొన్న చైర్మన్, సభ్యులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 15: రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించిన గృహజ్యోతి పథకంలో భాగంలో భాగంగా ప్రతీ ఇంటికి 200 యూనిట్ల కరెంట్ మాఫీ కోసం మీటర్ల వివరాలను సేకరించేందుకు సెస్ సంస్థకు కొత్తగా ప్రత్యేక యాప్‌తోపాటు సెస్ పరిధిలోఉన్న బకాయిలను వసూళ్లు చేసి సంస్థలను లాభాల్లోకి తీసుకెళ్లేందుకు డైరెక్టర్‌లు సహకరించాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కోరారు. సిరిసిల్ల సెస్ కార్యాలయంలో గురువారం సెస్ పాలకవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో 2024 జనవరి నెలలో సభ్యత్వ నమోదుతోపాటు రెవెన్యూ డిమాండ్, వసూళ్లు, జమఖర్చులపై చర్చించారు. అలాగే విద్యుత్ మీటర్లతోపాటు ఎలక్ట్రికల్ మెటీరియల్ కొనుగోలుపై చర్చించి తీర్మానాలు చేశామని చైర్మన్ తెలిపారు. సెస్ పరిధిలో ఉన్న సెస్ బకాయిలను వసూళ్లు చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకంలో భాగంగా సెస్ పరిధిలో కరెంట్ మీటర్ల వినియోగదారుల వివరాలను సేకరిస్తామన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతి, డైరెక్టర్లు దిడ్డి రామాదేవి, దార్నం లక్ష్మీనారాయణ, మల్లుగారి రవీందర్‌రెడ్డి, గౌరినేని నారాయణరావు, వరుస కృష్ణహరి, సందుపట్ల అంజిరెడ్డి, మాడుగుల మల్లేశం, పోన్నాల శ్రీనివాస్‌రావు, అకుల గంగారాం, నామాల ఉమ, రేగుల పాటి హరిచరణ్‌రావు, అకుల దేవరాజం, కొట్టెపల్లి సుధాకర్, సెస్ ఎండీ సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఫిబ్రవరి 15 : పుట్టిన పిల్లలనుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలని జిల్లా డిప్యూటి వైద్యాధికారి డాక్టర్ రజిత కోరారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో గురువారం వైద్యాఆరోగ్యశాఖ అధ్వర్యంలో పల్‌పోలియో కార్యక్రమాలపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులకు కరీంనగర్ డబ్ల్యూహెచ్‌వో కో-ఆర్డినేటర్ డాక్టర్ అతుల్ నిగమే శిక్షణ అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడుతూ మార్చి 3, 4, 5వ తేదీల్లో పిల్లందరికి పల్స్ పోలియో చుక్కలు ఇంటికి వెళ్లి వేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ నాయిమ్‌జాన్, పీవో అర్‌ఎస్‌బీకే లింగం, హెచ్‌ఈవో డిప్యూటి డీఈఎంవో బాలయ్య, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలు ఉదయమే రావాలి: డీఆర్‌డీవో

ముస్తాబాద్, ఫిబ్రవరి 15: ఉపాధిహామీ కూలీలు వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉదయమే వచ్చి త్వరగా పనులు ముగించుకోవాలని డీఆర్‌డీవో శేషాద్రి పేర్కొన్నారు. మండలంలోని పోతుగల్, తుర్కపల్లె గ్రామంలో ఉపాధిహామీ పనులను పర్యవేక్షించారు. కూలీలు ఉదయమే వచ్చి పనులు ముగించుకోవాలన్నారు. పోత్గల్ నర్సరీను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కరశర్మ, ఏపీవో ఆనంద్‌మోహన్, పంచాయతీ కార్యదర్శులు టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: గ్రామీణ ప్రాంతాల్లో పని కల్పించి పేదల జీవన ప్రమాణాలు పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఉపాధి హామీ పథకం' చేపట్టిందని డీఆర్‌డీవో శేషాద్రి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో కొనసాగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండలు తీవ్రమవుతున్న తరుణంలో ఉదయం పూట పనులను చేయాలని పేర్కొన్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టి పనుల పరిశీలనకు వచ్చిన ఆయనను అధికారులు, కూలీలు శాలువాతో సన్మానించారు. ఎంపీడీవో సత్తయ్య, ప్రత్యేక అధికారి భూమిరెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఈజీఎస్ ఏపీవో కొమురయ్య, పంచాయతీ కార్యదర్శి హరిందర్, టీఏలు రాజు, నవత, ఎఫ్ఏ దేవేందర్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు అశ్విత ఎంపిక



కుల్ల అశ్విత

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 15: సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కుల్ల అశ్విత రాష్ట స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైందని పాఠశాల పీఈటీ సాన బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కబడ్డీ అసోషియేషన్ సబ్ జూనియర్ విభాగంలో కుల్ల అశ్విత ఈ నెల 16నుంచి 19వ తేదీవరకు సూర్యాపేట జిల్లాలోని మల్లారెడ్డిగూడెంలో జరిగే 33వ సబ్ జూనియర్ కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికన అశ్వితను మండల విధ్యాధికారి దూస రఘుపతి, ఇన్‌చార్జి హెచ్‌ఎం పోలాస మల్లేశం, జిల్లా కబడ్డీ అసోషియేషన్ కార్యదర్శి ఎస్ఎస్ తిరుపతి, కౌన్సిలర్ కల్లూరి రాజు అభినందించారు.

రాజన్న భక్తులకు అన్నదానం

వేములవాడ, ఫిబ్రవరి 15: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు సిరిసిల్ల అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం నాడు అన్నదానం నిర్వహించారు. మేడారం సమ్మక్క సారక్క జాతరకు ముందు ప్రతినిత్యం వేలాది మంది భక్తులు రాజరాజేశ్వరస్వామి వారి దర్శనం కోసం వస్తున్న క్రమంలో రాజన్న ఆలయ పార్కింగ్ స్థలంలో గురువారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని డీఎస్పీ నాగేంద్ర చారి ప్రారంభించారు. ఆలయ ఈఈ రాజేష్, డీఈ డి శేఖర్, ప్రోటోకాల్ పర్యవేక్షకులు సిరిగిరి శ్రీరాములు, అయ్యప్ప సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 15: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనకు నిరసనగా శుక్రవారం చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను సిరిసిల్లలో విజయవంతం చేయాలని అఖిల పక్షం నాయకులు కోరారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. శుక్రవారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ, ధర్నాలో అన్ని వర్గాల కార్మికులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కోడం రమణ, కడారి రాములు, ఎలిగేటి రాజశేఖర్, గోనే ఎల్లప్ప, గాజుల విద్యాసాగర్, సిరిమల్లే సత్యం, అజ్జ వేణు తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి: రాష్ట్ర వ్యాప్త ఆటో కార్మికులు ఇచ్చిన బంద్‌ను విజయవంతం చేయాలని మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు బత్తుల కమలాకర్ కోరారు. గురువారం అయన మండల కేంద్రంలో మాట్లాడుతూ ఆటో కార్మికుల జేఏసీ ఇచ్చిన రాష్ట్రవ్యాప్తంగా ఆటోల బంద్‌కు మండలంలోని ఆటో కార్మికులందరూ శుక్రవారం జరిగే ఆటో బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణంతో ఆటో కార్మికులు నడిరోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు.

బీఆర్ఎస్ పాలనలో 'వేములవాడ'పై తీవ్ర నిర్లక్ష్యం

- అసెంబ్లీలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 15: పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో వేములవాడ నియోజకవర్గాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేశారని వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. గురువారం నాడు రాష్ట్ర అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. సాగునీటి రంగంలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు స్టేజ్ 2, ఫేజ్ 1 పనులకు దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి 1737 కోట్లు మంజూరు చేయగా వాటిలో మరో 10 శాతం పనులు పూర్తి చేస్తే వేములవాడ నియోజకవర్గం సుమారు 43 వేల ఎకరాల పైచిలుకు సాగునీరు పంట పొలాలకు అందుతుందని అన్నారు. కథలాపూర్, భీమారం, మేడిపల్లి మండలాల ప్రజలకు సాగు, తాగునీరుకు ఉపయోగ పడే కలికోట సూరమ్మ చెరువు రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువలకు 2018 సం వత్సరంలో గత ప్రభుత్వం హయాంలో కేవలం శంకుస్థాపన చేసి వదిలేసార న్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల జరిగిన రివ్యూలో ప్రాజెక్టు పనులపై సమీక్ష నిర్వహించారని, నిధుల విడుదలకు హామీ ఇచ్చారని అన్నారు. మరిపెల్లి రిజర్వాయర్, లచ్చంపేట రిజర్వాయర్, నూకలమర్రి గ్రామంలోని లొంకచెరువు, ఆశిరెడ్డిపల్లె గ్రామంలోని కొత్తచెరువు, ననుగుల గ్రామంలోని ఎర్ర చెరువు పటేల్ చెరువులను నీటితో నింపడానికి అవసరమైన నిధులను విడుదల చేయాలని కోరారు. రుద్రంగి మండలంలోని నాగారం చెరువు రిజర్వాయర్‌లోకి వెళ్లే కాలువల పైన బ్రిడ్జిలు లేకపోవడంతో రైతులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వీలైనంత త్వరలో నాగారం చెరువు కాలువపై బ్రిడ్జిల నిర్మాణంతో పాటు, అచ్చయ్య కుంట కాల్వ మరమ్మతులు చేయవలసిందిగా కోరారు. బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని రాళ్లవాగు ప్రాజెక్టు కింద వేములవాడ నియోజకవర్గం కథలాపూర్ మండలం పరిధిలోని పలు గ్రామాల్లో సుమారు 3500 ఎకరాలకు సాగునీరు అందించే కాలువలు వర్షాకాలంలో తెగిపోయిందని, వీలైనంత త్వరగా కాలువల మరమ్మతులు చేయాలని కోరారు. గత వర్షాకాలంలో వరదల వల్ల తెగిపోయిన కథలాపూర్ మండలం గంభీర్పూర్ కొత్తచెరువు, రాజలింగంపేట, గోవిందరాజుల చెరువు, బొమ్మన ప్రాజెక్టుకు మరమ్మతులు, చింతకుంట రాజారాం తండా, దుంపేట గ్రామాల్లో తెగిపోయిన చెరువులకు మరమత్తుల కోసం నిధులను మంజూరు చేయాలని కోరారు.

● వీటీడీఏకు రెండు నెలల్లో 20 కోట్ల నిధులు

గత ప్రభుత్వం వేములవాడ దేవస్థాన అభివృద్ధికి ఏటా 100 కోట్లు ఇస్తానని హామీ ఇచ్చి మర్చిపోయిందని, వేములవాడ దేవస్థానం అభివృద్ధికి వీటీడీఏ ద్వారా గత ముఖ్యమంత్రి వీటీడీఏ చైర్మన్ హోదాలో కనీసం ఒక్క సమీక్ష సమావేశం నిర్వహించలేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన వీటీడీఏ సమావేశం ఏర్పాటు చేసి 20 కోట్ల నిధులను విడుదల చేశారన్నారు. గుడి చెరువులో మురికి నీరు కలవకుండా నూతన కాలువ నిర్మాణానికి ఎస్టీపీ నిధులను విడుదల చేయాలని కోరారు. వేములవాడ పట్టణంలో మూలవాగు పై ఏడు సంవత్సరాలుగా బ్రిడ్జి నిర్మాణం జరుగుతూనే ఉందని, ట్రాఫిక్ కష్టాలు తీరడానికి తిప్పాపూర్ బ్రిడ్జి నిర్మాణానికి, తిప్పాపూర్ నుంచి గుడి ముందర వరకు రోడ్డు వెడల్పు చేయడానికి అవసరమైన 35కోట్ల నిధులను విడుదల చేయాలని కోరారు. వేములవాడలోని 100 పడకల ఆసుపత్రిలో సరిప డా సిబ్బంది లేరని, డాక్టర్లను, స్టాఫ్ నర్సులను, సరిపడా సిబ్బందిని నియమిం చాలని కోరారు. ముంపు గ్రామాల ప్రజలకు ఐదు లక్షల ఇందిరమ్మ ఇళ్ల కింద పరిహారంతో పాటు, వారికి సరైన ఉపాధి లభించేలా పరిశ్రమలను ఏర్పాటు చే యాలని కోరారు. వేములవాడ నియోజకవర్గంలో రోడ్లు, బ్రిడ్జిల సమస్య ప్రధాన సమస్యలని, మేడిపల్లి, భీమారం, చందుర్తి మండల ప్రజలకు ఎంతో ఉపయోగ పడే మోత్కురావుపేట్-చందుర్తి రోడ్డుకు అటవీశాఖ అనుమతులు కల్పిస్తూ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. మరిమడ్ల, మానాల రోడ్డును పూర్తిచేయాలని కోరారు. కోనరావుపేట మండల పరిధిలోని మూలవాగు, పెంటి వాగులపై బావుసాయిపేట-వెంకట్రావుపేట, మామిడిపల్లి-నిజామాబాద్, వట్టిమల్ల-నిమ్మపల్లి, సిరిసిల్ల నుంచి సిరికొండ వెళ్లే రహదారి వెంకట్రావుపేట వద్ద, వేములవాడ నుంచి సిరికొండ వెళ్లే బ్రిడ్జి గొల్లపల్లి వద్ద బ్రిడ్జిల నిర్మాణానికి నిధులను విడుదల చేయాలని కోరారు. కరీంనగర్ నుంచి వేములవాడకు వచ్చే ప్రధాన రహదారిని కొదురుపాక నుంచి నంది కమాన్ వరకు నాలుగు వరుసల రహదా రిగా పూర్తి చేయాలని కోరారు. వేములవాడలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, నియోజకవర్గంలో పాలిటెక్నిక్, ఐటీఐ కళాశాలలను, మేడిపల్లి, భీమారం మండలాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలను మంజూరు చేయాలని కోరారు.

మాజీ సీఎం కేసీఆర్‌ను అరెస్టు చేయాలి

- విచారణ పేరుతో కాలయాపన చేస్తున్న కాంగ్రెస్
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 15: కాళేశ్వరం ప్రాజెక్టులో లక్షల కోట్ల ప్రజాధనాన్ని వృధాచేసిన మాజీ ముఖ్యంత్రి కేసీఆర్‌ను వెంటనే అరెస్టు చేయాలని, ఆయన కుటుంబ ఆస్తులను జప్తు చేయాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. వేములవాడ మండలం అగ్రహారం ఆంజనేయస్వామి వారి ఆలయాన్ని సందర్శించి స్వామి వారిని దర్శించుకుని మొదటిదఫా ప్రజాహిత యాత్రను ముగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ గత అక్టోబరు 21వ తేదీన కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ మెయిన్ బ్యారేజ్ పిల్లర్ కుంగిందని తెలిసి 24వ తేదిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం వచ్చి విచారణ చేపట్టిందన్నారు. ప్రాజెక్టులోని లోపాలతో కూడిన 20 అంశాలతో నివేదికను బృందం తయారు చేసిందని తెలిపారు. నివేదికపై ప్రభుత్వాన్ని వివరణ కోరగా 11 అంశాలకు మాత్రమే వివరణ ఇచ్చి మిగతా తొమ్మిది అంశాలపై ఎలాంటి వివరాలు ఇవ్వకుండా నిరాకరించి, నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కేంద్రానికి సంబంధించిన బృందం విచారణ చేపట్టి నివేదిక అందించినప్పటికీ ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకునేది పోయి మళ్లీ విచారణ చేస్తున్నామని కాలయాపన చేయడం ప్రజలను మభ్యపెట్టడానికేనని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టేందుకు కాళేశ్వరం పేరుతో కాంగ్రెస్ కృష్ణా జలాల పేరుతో బీఆర్ఎస్ నాటకాలకు తెరలేపాయని మండిపడ్డారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ స్వయం ప్రకటిత మేధావి హైద్రాబాద్‌లోని బోయినపల్లి సమీపంలో నర్సింగపూర్‌లో చేసిన రూ. 500 కోట్ల భూదందాను బయటకు తీయాల్సి వుంటందని హెచ్చరించారు. తనను ఎక్కువ గెలికితే నేను కూడా ఎక్కువ గెలుకుతానని హెచ్చరించారు. వారి వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, రాణిరుద్రమ తదితరులు ఉన్నారు.



తంగళ్లపల్లిలో మహిళలకు అభివాదం చేస్తున్న ఎంపీ బండి సంజయ్

● అగ్రహారం శ్రీజోడాంజనేయస్వామి వారిని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంయ్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. ప్రజాహిత యాత్రలో భాగంగా వేములవాడ మండలం అగ్రహారం చేరుకున్న ఆయనకు ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న ఆయనను అర్చకులు ఆశీర్వదించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, రాణిరుద్రమ, నాయకులు బుర్ర శేఖర్, జింక అనిల్‌కుమార్, రేగుల సంతోష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కేంద్రం ఇచ్చిన నిధులతోనే అభివృద్ధి..

తంగళ్లపల్లి: కేంద్రం ఇచ్చిన నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందని ప్రజాహిత యాత్రలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో ప్రజాహిత యాత్రలో భాగంగా బండి సంజయ్ మాట్లాడారు. రైతుల కోసం జైలుకు వెళ్లనాని.. ప్రజల పక్షాన పోరాటం చేసిన బీజేపీకి కాకుండా కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. రానున్న ఎన్నికల్లో పునరావృతం కాకుండా ప్రజల పక్షాన నిలబడే బీజేపీకి ఓటు వేయాలన్నారు. సిరిసిల్లలో రాచరిక పాలన కొనసాగిందని కేటీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలకు బుద్ధి చెప్పి మోదీని ఆశీర్వదించాలన్నారు. అనంతరం తంగళ్లపల్లిలో బీజేపీ కార్యలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమాల్లో సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి రాణి రుద్రమ, నాయకులు రెడ్డబోయిన గోపి, రాగుల రాజిరెడ్డి, వెన్నమనేని శ్రీధర్‌రావు, గజభీంకర్ సంతోష్ తదితరులు ఉన్నారు.




ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న బండి సంజయ్



దాడికి పాల్పడిన వ్యక్తుల రిమాండ్

చిగురుమామిడి,ఫిబ్రవరి15: మండలంలోని రేకొండ గ్రామానికి చెందిన ఎలకపల్లి రమేష్, ఎలకల పల్లి నవీన్ అనే వ్యక్తులపై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్ చేసినట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. ఇదే గ్రామానికి చేందిన కండె సాయికిరణ్ అనే వ్యక్తితో ఎలకపల్లి రమేష్, ఎలకపల్లి నవీన్‌లు డబ్బులు విషయంలో గొడవకు దిగారు. కత్తితో సాయికిరణ్‌పై దాడికి పాల్పడ్డారు. బాధితుడి తండ్రి కండె మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై తెలిపారు.







ముగిసిన తొలిదశ ప్రజాహిత యాత్ర


సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బండి సంజయ్ ప్రజాహిత యాత్ర

సిరిసిల్ల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గ్రామాలకు అందిస్తున్న నిధుల లెక్కలు వినిపిస్తూ ప్రజాసమస్యలు తెలుసుకుంటూ ఎంతో ఉత్సాహంగా సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర గురువారం ముగిసింది. కొండగట్టు అంజన్న దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసి మేడిపల్లి వద్ద ప్రారంభించిన ప్రజాహిత యాత్ర రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అగ్రహారం అంజనేయస్వామి దేవస్థానం వద్ద ప్రత్యేక పూజలతో ముగించారు. చివరి రోజు తంగళ్లపల్లి మండ ల కేంద్రం నుంచి సిరిసిల్ల జిల్లా కేంద్రం మీదుగా అగ్రహారం వరకు కొనసాగింది. సిరిసిల్లలో కొండా లక్ష్మణ్‌బాపూజీ, చాకలి ఐలమ్మ, గాంధీ, అంబేద్కర్, చేనేత విగ్రహాలకు పూలమాలలు వేశారు. ముగింపు సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేశారు. ఆరు రోజుల పాటు రెండు నియోజకవర్గాల్లో 13 మండలాలు, రెండు మున్సిపాలిటీలు, 81 గ్రామాల్లో యాత్ర సాగింది.

● బీఆర్ఎస్‌కు ఒక్క ఎంపీ సీటు కూడా రాదు

ముగింపు సందర్భంగా బండి సంజయ్ విలేకరుల సమావేశంలో మాట్లా డారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు ఒక్క ఎంపీ సీటు కూడా రాదని, బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ మాకేందని ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా 400 సీట్లు బీజేపీకి రాబోతున్నాయని వివరించారు. మోదీ హవాను తట్టుకోలేక బీఆర్ఎస్, కాంగ్రెస్ కలిసి బీజేపీని దెబ్బ తీసేందుకు విషప్రచారం చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ అడెపు రవీందర్, అల్లాడి రమేష్, ఎర్రం మహేష్, బర్కం వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

గోదావరిలో పడి వ్యక్తి మృతి

వెల్గటూర్, ఫిబ్రవరి 15: కోటిలింగాల గోదావరిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు ఎస్సై ఉమాసాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. దండేపల్లి మండలం మ్యాదరిపేటకు చెందిన బత్తిని కమల్‌గౌడ్ (27) అనే యువకుడు తనకు డాటా ఎంట్రీ ఆపరే టర్ ఉద్యోగం వచ్చిందని చెప్పి ఇంటి నుంచి రూ.70 వేలు, బంధువుల దగ్గర రూ.44,500 తీసు కొని ఈ నెల 13న మధ్యాహ్నం టీఎస్ 09ఇసి3725 నంబ రు గల స్కూటీపై ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అదే రోజు రాత్రి తనకు వరుసకు అల్లుడైన ఆకుల పవన్‌కు తన మొత్తం డబ్బులు హ్యాక్ అయ్యాయని ఫోన్ చేసి చెప్పాడు. ఈ క్రమంలో బుధవారం కోటిలింగాల గోదావరిలో శవమై తేలాడు. తన దగ్గర ఉన్న డబ్బులు మొత్తం అయిపోవడంతో చేతిలో డబ్బులు లేకుండా ఇంటికి ఎలా వెళ్లాలో తెలియక గోదావరిలో దూకి ఆత్మహత్య కు పాల్పడినట్లు మృతుని తండ్రి బత్తిని మల్లేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భవనం పైనుంచి పడి ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి15: ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులోని డబల్‌బెడ్ రూం ఇళ్ల సముదాయంలో శ్రీగాద భాస్కర్ అనే వ్యక్తి గురువారం భవనం మొదటి అంతస్తు పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రగాయాల పాలయ్యాడు. అతన్ని కుటుంబీకులు, కాలనీవాసులు మండల కేంద్రంలోనీ ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గ్రామంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో భాస్కర్ తన కుటుంబీకులతో కలిసి మొదటి అంతస్తులో నివాసముంటున్నాడు. భవనం బాల్కనీ నుంచి కిందకు చూస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. భాస్కర్ పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

గంభీరావుపేట, ఫిబ్రవరి 15 : గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్ గ్రామ సమీప వ్యవసాయ బావిలో దూకి లింగన్నపేటకు చెందిన బర్కుటం లక్ష్మి (65) అనే వృద్ధురాలు గురువారం ఆత్మహత్య చేసుకుంది. పోలీస్‌లు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగన్నపేటకు చెందిన లక్ష్మి భర్త ఎనమిదేళ్ల క్రితం చనిపోయాడు. ఉన్న ఒక కొడుకు మూగవాడు కావడంతో లక్ష్మి తరుచూ ఆవేదన చెందేది. కొడుకు గ్రామ సమీపంలో ఉన్న రైస్‌మిల్‌లో పనిచేస్తూ అక్కడే ఉండేవాడు. ఇంట్లో లక్ష్మి ఒంటరి జీవితం గడుపుతూ మనోవేదనతో మానసికంగా బాధపడుతూ ఉండేది. ఈ క్రమంలో లక్ష్మి మతిస్థిమితం కోల్పోయినట్లు ప్రవర్తించింది. ముస్తాఫనగర్ గ్రామ సమీపాన గల వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. మృతురాలు మరిది భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు.

రైతు మృతిపై వీడని మిస్టరీ

● సీపీకి ఫిర్యాదు చేసిన మృతుడి కుటుంబ సభ్యులు


కొమురయ్య (ఫైల్)

గన్నేరువరం, ఫిబ్రవరి 15, మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు పంబాల కొమురయ్య(55) తన వ్యవసాయ క్షేత్రంలో బుధవారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ విషయమై గురువారం తిమ్మాపూర్ రూరల్ సీఐ స్వామి, గన్నేరువరం ఎస్ఐ చందా నరసింహారావుతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. బుధవారం రాత్రి మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టంకు తరలించగా గురువారం సాయంత్రం వరకు పోస్టుమార్టం చేపట్టలేదు. గుండ్లపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన వ్యవసాయబావి నుంచి మోటారును బయటకు తీసేందుకు తన తండ్రిని తీసుకెళ్లాడని అక్కడే విద్యుదాఘాతంతో తన తండ్రి మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుడి కుమారుడు రాజశేఖర్ గురువారం సీపీకి ఫిర్యాదు చేశాడు. అనంతరం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోస్టుమార్టం నివేదిక అందిన తర్వాత మృతికి గల కారణాలను వెల్లడిస్తామని ఎస్ఐ చందా నరసింహారావు తెలిపారు. చట్టప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.





అనుమానాస్పదంగా సంచరిస్తున్న

యువకుడిని చితకబాదిన గ్రామస్థులు

గొల్లపల్లి, ఫిబ్రవరి 15: మండలంలోని వెన్గుమట్ల గ్రామంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న అపరిచిత యువకుడిని పిల్లలను ఎత్తుకెళ్లే ముఠా సభ్యుడు అనుకుని గ్రామస్థులు చితకబాదారు. అనంతరం గొల్లపల్లి పోలీసులకు అప్పగించారు. యువకుడు కొంతకాలంగా మతిస్థిమితం సరిగా లేక తిరుగుతున్నాడని పోలీసుల విచారణలో తేలడంతో తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఎస్సై చిర్ర సతీష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. సిద్ధిపేట జిల్లా జూలపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్(25) కొంతకాలంగా మతి స్థిమితం సరిగా లేక హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ పిచ్చి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇటీవల స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. ఆరు నెలల క్రితం ఇంటిలో నుంచి అదృశ్యం కావడంతో యువకుడి తల్లిదండ్రులు అతని ఆచూకీ కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో వెన్గుమట్ల గ్రామంలో యువకుడు అనుమానాస్పదంగా సంచరించడాన్ని గ్రామస్థులు గుర్తించారు. వారం రోజులుగా పిల్లలను ఎత్తుకెళ్లే ముఠా గ్రామాల్లో సంచరిస్తున్నట్లు సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతుంది. దీంతో గ్రామస్థులు పిల్లలను ఎత్తుకెళ్లే ముఠాకు సంబంధించిన దొంగ అనుకుని యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. బాధిత యువకుడిని విచారించగా అతని మానసిక స్థితి సరిగా లేదని గుర్తించారు. అతని తల్లిదండ్రులకు సమాచారం అందించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎస్సై మాట్లాడుతూ వదంతులను సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని సూచించారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

వీణవంక,ఫిబ్రవరి15:మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ నజీర (20) పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం... నజీర మానసిక స్థితి సరిగాలేకపోవడం, అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జమ్మికుంట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లి షేక్ హైదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న టాక్టర్ పట్టివేత

వీణవంక,ఫిబ్రవరి 15: మండలంలోని మాల్లారెడ్డిపల్లి గ్రామ మానేరు వాగు నుంచి ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్నా టాక్టర్ ను పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించినట్టు పోలీస్‌లు తెలిపారు.చల్లూరు గ్రామ చివరులో వాహనాలు తకిఖీలు చేస్తుండగా మాల్లారెడ్డిపల్లి గ్రామనికి చెందిన మేకల శ్రీనివాస్ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణ చేస్తుండగా అతని పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.మండలంలో అనుమతులు లేకుండ అక్రమంగా ఇసుక రవాణ చేస్తే కటిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఏటీఎం దోపిడీకి పాల్పడిన నిందితుడి అరెస్టు

● పరారీలో మరో ముగ్గురు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 15: ఈ నెల 10న గోదావరిఖని గౌతమినగర్ హనుమాన్ గుడి వద్ద ఉన్న ఏటీఎంలో డబ్బులు దోచుకెళ్లిన ఘటనలో ప్రధాన నిందితుడు హకీముద్దీన్‌ను రామగుండం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ మేరకు రామగుండం సీఐ టీ ప్రవీణ్ కుమార్ అరెస్టు వివరాలను వెల్లడించారు. హర్యాన రాష్ట్రానికి చెందిన హకీముద్దీన్, సోకెంఖాన్, అమీర్‌ఖాన్, వసీంఖాన్‌లు ఈ నెల 10న అర్ధరాత్రి గౌతమినగర్‌లోని ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి అందులోని రూ.27,59,000లను దోచుకెళ్లారు. ఈ ఘటనపై రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని హర్యాన రాష్ట్రంలో నిందితులు పారిపోతుండగా హకీముద్దీన్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్టు సీఐ తెలిపారు. మిగతా నిందితులు సోకెంఖాన్, అమీర్‌ఖాన్, వసీంఖాన్ పారిపోయారని, వీరిని పట్టుకోవడానికి బృందాలు గాలింపు చర్యలు చేస్తున్నట్టు తెలిపారు. నిందితున్ని పట్టుకోవడానికి కృషి చేసిన సిబ్బందిని పెద్దపల్లి డీసీపీ చేతన్ అభినందించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 15 : మోతాదుకు మించి అధికంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు కరీంనగర్ మున్సిఫ్ కోర్టు బెజిస్ట్రేట్ జైలుశిక్ష, జరిమానా విధించారని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 22 మంది వాహనదారులను గురువారం కోర్టులో హాజరుపరచగా ఒక వ్యక్తికి 10 రోజులు, మరొకరికి 7 రోజులు, ఇంకొకరికి 3 రోజుల వంతున జైలు శిక్షతో పాటు ముగ్గురికి కలిపి 6 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగతా 19 మంది వాహనదారులకు 33,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

నివేదన



భద్రాచలానికి వచ్చే మార్గంలో దుమ్ముగూడెం (దూమగూడెం) అనే ఊరు ఉంది. దాని అవతలి ఒడ్డున ఉన్న చిన్న గుట్ట సమీపంలోనే జటాయువుకు, రావణుడికి యుద్ధం జరిగినట్టు రామాయణంలో ఉంది. ఆ గుట్ట దగ్గరే జటాయువుకు శ్రీరాముడు అంత్య సంస్కారాలు చేశాడు.

పంచవటి మనదే!

అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణప్రతిష్ఠ అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ శ్రీరామ వనవాస మార్గం గురించి వివరించారు. ఆ వివరాలకు సంస్కృత రామాయణంలో వాల్మీకి రచించిన దానికీ తేడా ఉంది. అయోధ్య నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఉన్న భరద్వాజ ఆశ్రమానికి, మధ్యప్రదేశ్‌లోని చిత్రకూటానికి, మహారాష్ట్రలోని నాసిక్ దగ్గర ఉన్న పంచవటికి, ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా లేపాక్షికి, కర్ణాటకలోని కిష్కింధకు, తమిళనాడులోని రామేశ్వరానికి, అక్కడి నుంచి శ్రీలంకకు శ్రీరాముడు పయనించాడనడం సరికాదేమో! ప్రధాని తన ప్రసంగంలో లేపాక్షి, నాసిక్‌లోని పంచవటుల గురించి ప్రస్తావించారే కానీ... దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచల రామాలయం సమీపంలోని పంచవటి గురించి కానీ, అసలు ఆ ఆలయం గురించి కానీ కనీసం ప్రస్తావించలేదు. ఇది తెలుగువారిని ఒకింత నిరాశకు గురిచేసిందనాలి. అయోధ్య నుంచి లంక దాకా శ్రీరాముడి ప్రస్థానం, తిరుగు ప్రయాణంలో అయోధ్యకు వస్తూ సీతకు రాముడు చూపించిన ప్రదేశాలు వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు)గారి 'ఆంధ్ర వాల్మీకి రామాయణం' (మందరం) వ్యాఖ్యానంలో వివరంగా ఉన్నాయి.

అరణ్యాలకు బయలుదేరిన సీతారామలక్ష్మణులు తామసా నదీ తీరం, ఉత్తరకోసల దేశం, వేదశ్రుతి నది, గోమతీ నది, దక్షిణ కోసల దేశ సరిహద్దులు దాటి... గంగానదీ తీరంలోని శృంగబేరి పురాన్ని చేరారు. గుహుడి సాయంతో గంగను దాటి, గంగా యమున సంగమ స్థలిలోని భరద్వాజ ముని ఆశ్రమానికి వెళ్ళారు. యమునను దాటి, నీలవన మార్గంలో పయనించి, మందాకినీ సరయూ నది దగ్గరలో ఉన్న చిత్రకూటం చేరారు. అక్కడ వాల్మీకిని చూశారు. చిత్రకూటంలో లక్ష్మణుడు పర్ణశాల నిర్మించాడు. భరతుడు చిత్రకూటానికి వచ్చి, వెళ్ళాక... వారు అత్రి మహాముని ఆశ్రమానికీ, అనంతరం దండకారణ్యంలో ప్రవేశించి, విరాధుణ్ణి సంహరించి, శరభంగ మహర్షి ఆశ్రమానికీ, అటు నుంచి సుతీక్ష్ణాశ్రమానికీ, మాండకర్ణి ఆశ్రమానికీ ప్రయాణించారు. అగస్త్యుణ్ణి ఆయన ఆశ్రమంలో దర్శించుకున్నారు. పంచవటి అనే నివాస యోగ్యమైన స్థలం రెండు ఆమడల దూరంలో ఉందని అగస్త్యుడు సూచించాడు. అగస్త్యుడు చెప్పిన మార్గంలో వెళ్తూ, దారిలో ఒక మర్రి చెట్టు మీద ఉన్న జటాయువును రాముడు కలిశాడు. తరువాత సీతా లక్ష్మణ సమేతుడై పంచవటిని చేరుకున్నాడు. అక్కడ పర్ణశాల నిర్మించమని లక్ష్మణుడికి చెప్పాడు. లక్ష్మణుడు కుటీరాన్ని సిద్ధం చేశాడు. అవే ఇప్పటికీ భద్రాచలానికి 30 కిలోమీటర్ల దూరంలో ఎందరో భక్తులను ఆకర్షిస్తున్న పంచవటి, పర్ణశాలలు. భద్రాచలం సమీపంలో ఉన్నది పర్ణశాల కాదనీ, అది నాసిక్‌కు దగ్గరగా ఉందనీ చెప్పడం పూర్తిగా సత్యదూరం.

పంచవటి గోదావరీ తీరంలో ఉందనేది నిర్వివాదాంశం. అక్కడ గోదావరి ఉత్తరం నుంచి దక్షిణానికి పారుతూ ఉండాలి. ఎందుకంటే సీతాపహరణం తరువాత... సీతను రావణుడు తీసుకువెళ్ళినది దక్షిణ దిక్కుగానని మృగాలు, పక్షులు సూచించిన మేరకు... రామలక్ష్మణులు గోదావరీ తీరాన మొదట నైరుతి దిశగా వెళ్ళారు. తరువాత దక్షిణంగా వెళ్ళారు. గోదావరీ తీరంలో వారు జటాయువును చూశారంటే... గోదావరి నది జటాయువు పడిన స్థలం వరకూ... దక్షిణాభిముఖంగా పారుతూ ఉండాలి. జటాయువుకు గోదావరీ జలాలతో నివాపాలు (తిలోదకాలు) విడిచారు. అక్కడి నుంచి రామ లక్ష్మణులు తూర్పుగా వెళ్ళడానికి ఏరు అడ్డం వస్తుంది కాబట్టి... నైరుతి దిశగానే మూడు కోసుల దూరం పయనించారు. కొంత తూర్పుగా వెళ్తే కాని జటాయువు చెప్పిన దక్షిణ మార్గం కనిపించదు కాబట్టే... అక్కడి నుంచి మూడు కోసులు తూర్పుగా వెళ్ళారనుకోవాలి. అంటే అప్పుడు వారు.. ఇప్పటి భద్రాచలం దగ్గర, గోదావరి నదికి దక్షిణాన ఉన్నారు. అలా వచ్చారు కాబట్టి గోదావరి దాటవలసిన పని లేదు. ఆ కారణం వల్ల పంచవటి గోదావరి నదికి పడమటి తీరాన ఉందనే విషయం స్పష్టంగా అంగీకరించాలి. తూర్పున ఉన్నట్టయితే గోదావరి దాటే ఉండాలి. ఇప్పటి పర్ణశాలే యదార్థమయిన పంచవటి అయినా కావాలి. లేని పక్షంలో ఇప్పుడు అందరూ భావిస్తున్న పర్ణశాలకు ఎదురు ఒడ్డున, చక్కటి పంచవటి ఉండేదని మాత్రం నిర్ధారణగా చెప్పవచ్చు. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనీ, అక్కడి నుంచి దక్షిణంగా రామ లక్ష్మణులు వెళ్ళారనీ చేసే వాదన రామాయణానికి విరుద్ధం. పంచవటి గోదావరీ నది పశ్చిమ తీరాన ఉందనడానికి స్థలం ఆధారంగా ఉంది. పర్ణశాలకు ఎదురుగా ఉన్న గుట్ట దగ్గర రావణాసురుడు తన రథాన్ని నిలిపాడని అంటారు. కారణం... సీతాదేవిని ఎత్తుకురాగానే రథం సిద్ధంగా ఉండాలి కాబట్టి. నదికి ఒక ఒడ్డున రథం, మరో ఒడ్డున సీత ఉంటే... సీతాపహరణం సాధ్యమయ్యేది కాదనుకోవాలి. కాబట్టి పడమటి దిక్కున ఉన్న పంచవటి దగ్గర సీతాపహరణం జరిగి ఉండాలి. అలాగే అక్కడికి సమీపంలోనే 'సీత గుట్టలు' అనే పెద్ద పర్వతం ఉంది. ఖరుడు యుద్ధానికి వచ్చినప్పుడు... రామలక్ష్మణులు అక్కడ ఉన్న కారణంగా ఆ గుట్టలకు ఆ పేరు వచ్చిందంటారు.

హంపీ... పంప ఒకటి కాదు...

ఇప్పటి హంపీయే అప్పటి పంప అనీ, అక్కడే పర్ణశాల ఉన్నదనీ అనడం కూడా సరికాదు. రామలక్ష్మణులు లంకకు వెళ్ళేటప్పుడు ఏ మార్గం నుంచి వెళ్ళినా, తిరిగి వచ్చేటప్పుడు... విమానంలో తక్కువ దూరంలో ప్రయాణించే విధంగా... లంక నుంచి సముద్రం దాటాక... రామేశ్వరం నుంచి అయోధ్యకు వెళ్ళారనేది అందరూ అంగీకరించినదే. అలాంటప్పుడు ఎడమ వైపు కిష్కింధ, కుడివైపున పంచవటి ఉండి ఉండాలి. ఆ మార్గానికీ నాసిక్‌కూ సంబంధమే లేదు. కాబట్టి పంచవటి... నాసిక్ కానే కాదు. కావడానికి వీల్లేదు. సీతారామలక్ష్మణులు చిత్రకూటం నుంచి దక్షిణంగా ఋక్షవంతానికి వచ్చి, పశ్చిమాభిముఖంగా నాసిక్‌ను చేరినట్టయితే... మార్గమధ్యంలో

> పంచవటికి దగ్గరలోనే పద్మ సరస్సు ఉందని 'వాల్మీకి రామాయణం' చెబుతోంది. అలాంటి పెద్ద చెరువొకటి ఉండేదని అక్కడ ఉండే కోయలు చెబుతూ ఉంటారు. ఆ చెరువుకూ, గోదావరికీ మధ్య పంచవటి ఉంది.

వింధ్య పర్వతాన్ని, నర్మద, తపతీ నదులను దాటి... విదర్భ మీదుగా ప్రయాణించవలసి ఉంటుంది. వాటిని వారు దాటినట్టయితే... వాల్మీకి తప్పకుండా రాసేవాడు. రామలక్ష్మణులు దక్షిణానికి వచ్చి, ఆ తరువాత ఆగ్నేయంగా కిష్కింధకు వచ్చారనడం రామాయణానికి ప్రత్యక్ష విరుద్ధమని చెప్పాలి. నిజానికి...వారు నైరుతి మూలగా, నైరుతిగా వెళ్ళి, కంబంధుణ్ణి చంపి, పడమరగా వెళ్ళి, పంప (తుంగభద్ర) చేరి, పడమరలో ఉన్న శబరి గుహకు వెళ్ళారు. జటాయువు గుట్ట దగ్గర నుంచి నైరుతికి వస్తేనే కిష్కింధకు రాగలరు. అలాకాకుండా ఆగ్నేయ మూలగా వెళ్ళి ఉంటే... సముద్రతీరానికి చేరేవారే తప్ప కిష్కింధకు కాదు. ఆగ్నేయమూలగా వారు ప్రయాణించారని రామాయణంలో ఒక్క మాటయినా లేదు.

సీతారామలక్ష్మణుల వనవాసం చివర్లో... సీతాపహరణం కోసం రావణుడు, మారీచుడు కలిసి దండకారణ్యంలోని రామచంద్రుడి ఆశ్రమానికి చేరుకున్నారని 'వాల్మీకి రామాయణం'లో ఉంది. పర్ణశాలకు ఉత్తరాన పర్వతాలు, తూర్పున గోదావరి, దక్షిణ, పడమర దిశల్లో అడవి ఉన్నాయి. రాముణ్ణి మారీచుడు పడమరగానే తీసుకువెళ్ళాడు. రావణుడు వెళ్ళాల్సింది దక్షిణ మార్గాన కాబట్టి... ఆ దోవలో రాముడు ఉండకూడదని మారీచుడు అలా చేశాడు. సీతను రావణుడు అపహరించుకుపోతున్నప్పుడు... పర్ణశాలకు మైలు దూరంలోని వృక్షం దగ్గర జటాయువు ఎదురయింది. రావణుడు, జటాయువు మధ్య యుద్ధం అయిదారు మైళ్ళ దూరంలోని దుమ్ముగూడెం దగ్గరున్న జటాయువు గుట్ట వరకూ సాగింది. రావణుడు సీతను ఎత్తుకొని, పర్ణశాల నుంచి బయలుదేరి, కిష్కింధ మీదుగా, పర్వతాలు, తటాకాలు దాటి, సముద్రాన్ని సమీపించి, లంకకు పోయాడనుకోవాలి. ఇవన్నీ పర్ణశాల ఎక్కడుందో తెలిపే అంశాలు.

సీతాన్వేషణలో భాగంగా రామలక్ష్మణులు క్రౌంచారణ్యం, మతంగవనం, పంపానది ఒడ్డున ఉన్న ఋశ్యమూక పర్వతం మీదుగా వెళ్ళారు. అప్పటివరకూ వారు దక్షిణ దిక్కుగానే ప్రయాణం చేశారు. శబరి ఆశ్రమానికి తూర్పు దిక్కులోనే పోవాలి కాబట్టి... వారు పడమరగా వెళ్ళి, తూర్పుకు తిరగాల్సి ఉంటుంది. నాసిక్ దగ్గర పంచవటి ఉన్నదనే వారి వాదనకు ఇది పూర్తిగా వ్యతిరేకం. ఆ తరువాత వారు కిష్కింధ వెళ్ళారు. రావణుడితో యుద్ధానికి వెళ్ళేదాకా ప్రస్రవణ పర్వతం మీద ఉన్నారు. కిష్కింధకు ఆగ్నేయంగా ఉన్న లంకకు పోతూ మహేంద్ర పర్వతం ఎక్కారు. రావణ వధ అనంతరం సీతా సమేతంగా అయోధ్యకు పుష్పక విమానం మీద తిరుగు ప్రయాణం కావడం... వనవాసంలో భాగం. ఆ తిరుగు ప్రయాణంలో ఈ ప్రదేశాలన్నీ సీతకు రాముడు చూపించడం కొసమెరుపు.

(వాసుదాసు గారి 'ఆంధ్రవాల్మీకి రామాయణం' (మందరం) ఆధారంగా)

• వనం జ్వాలా నరసింహారావు

పర్వదినం



జగత్ చైతన్యకారకుడు

బ్రహ్మస్వరూపముదయే మధ్యాహ్నేతు మహేశ్వరః
సాయం సంధ్యే సదా విష్ణుం త్రయీమూర్తీర్దివాకరః

సూర్యుడు త్రిమూర్త్యాత్మకుడు. ముల్లోకాలలోని ప్రాణులతో... త్రికాలాలలో పూజలు అందుకుంటున్న ప్రత్యక్ష దైవం. ఆదిత్యుడు, దివాకరుడు, సూర్యనారాయణుడు... ఇలా ఆయనకు ఎన్నో నామాలు. ఈ చరాచర జగత్తుకు వెలుగును, తేజస్సును ఆయన ప్రసాదిస్తాడు. అదితి-కశ్యపులకు ఆయన జన్మించిన రోజైన మాఘ శుద్ధ సప్తమి... 'రథసప్తమి'గా ప్రసిద్ధిచెందింది. ఉత్తర దిశగా సూర్యుడి గమనం ఈ రోజే ఆరంభమవుతుందని 'మత్స్యపురాణం' చెబుతోంది. ముప్పై మూడు కోట్ల మంది దేవతలు ఉన్నారని మనం చెప్పుకొంటున్నా... మనకు నిత్యం దర్శనమిచ్చే దైవం ఆదిత్యుడే. ఈ సృష్టిలో పన్నెండుమంది ఆదిత్యులు ఉన్నారనీ, సమస్త జీవజాలానికీ, సృష్టివిధానానికీ వారే ఆధారభూతులనీ 'భవిష్యపురాణం' చెబుతోంది. నవగ్రహాలలో మనకు కనిపించే ఏడు గ్రహాలను వారంలోని ఏడు రోజులకు పేర్లుగా పూర్వ ఋషులు నిర్ణయించారు. ఆదిత్యుని పేరిట ఆదివారాన్ని స్థిరపరిచారు.

సూర్యుడు మానవుల మనుగడకు ఆధారభూతుడు. కాంతికి, శక్తికి, చైతన్యానికి కారకుడు. సమస్త జ్ఞాన, విజ్ఞానాలకు అధిపతి. ఆయనను కర్మసాక్షిగా, స్థితికారకుడిగా పురాణాలు, ఇతిహాసాలు అభివర్ణించాయి. సూర్యుడి శక్తివల్లనే భూమండలంతో సహా ఇతర గ్రహాలు సంచరిస్తున్నాయి. ఆయనాలు, ఋతువులు ఏర్పడడానికి సూర్యగమన శక్తే కారణం. యజ్ఞాగ్నిగా సౌర శక్తిని మన ఋషులు దర్శించారు. సూర్య, భూగ్రహాల మధ్య ఉన్న సంబంధాన్ని విజ్ఞానపరంగా విశ్లేషించి... జ్యోతిష శాస్త్రాన్ని నిర్మించారు. మాసాలు, పక్షాలు, తిథులను నిర్దేశించి పంచాంగ శాస్త్రాన్ని ఆవిష్కరించారు. గ్రహాలు, రాశుల సంచారాలు, కలయికలను పరిశీలించి... వాతావరణ విజ్ఞానం అందించారు. ఇంతటి మహోన్నతమైన విజ్ఞానానికి ఆధారం సూర్యభగవానుడే.

ఆధ్యాత్మికంగా పరిశీలిస్తే.. 'అఘము' అంటే పాపం... 'మా' అంటే తొలగించడం. మాఘ మాసంలో వచ్చే సూర్యజయంతి రోజున ఆయనను అర్చిస్తే పాపాలన్నీ తొలగిపోతాయనేది శాస్త్రవచనం. రథసప్తమి నాడు ఉత్తరాభిముఖంగా... రథంలో సూర్యుడు పయనిస్తాడు. ఆ రథానికి ఒకటే చక్రం. దానికి పన్నెండు ఆకులు. అవి పన్నెండు మాసాలకు సంకేతం. ఆ రథానికి ఒకటే అశ్వం. 'ఏకో అశ్వోవహతి సప్తనామా' అని చెప్పింది ఋగ్వేదం. ఆ రథంలో అధిష్ఠితుడైన సూర్యుని కాంతి ఏడు వర్ణాలుగా... కిరణాలుగా ప్రసరితమవుతుంది. వాటినే ఏడు అశ్వాలుగా పరిగణిస్తారు. ఈ విశ్వమంతా ఆ కిరణాల విలాసమే. అవి ఆరోగ్యప్రదాలని, సూర్యోదయవేళ ఆ లేత కిరణాలు శరీరంపై సోకితే... శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోతాయని, సూర్యనమస్కారాలతో దారుఢ్యం కలుగుతుందనీ ఆయుర్వేద, యోగ శాస్త్రాలు చెబుతున్నాయి. ఆదిత్యుని ద్వాదశనామాలు పఠిస్తూ, సూర్యుణ్ణి ప్రార్థనలు చేస్తే... ఆరోగ్య, ఆధ్యాత్మిక ప్రయోజనాలు చేకూరుతాయన్నది పెద్దల మాట.

• ఆయపిళ్ళ రాజపాప

వేడుక

వన వేలుపుల మహా జాతర

గిరిజనుల ఆరాధ్య దేవతలుగా, ఆపదలో ఉన్నవారిని ఆదుకొని, వారి కష్టాలు తీర్చే వేలుపులుగా వాసికెక్కారు సమ్మక్క, సారలమ్మ. ఆ వనదేవతలకు నిర్వహించే జాతర... తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందింది. అంతేకాదు... ఇది ఆసియాలో అతి పెద్ద గిరిజన జాతర. మన దేశంలో కుంభమేళా తరువాత అత్యధికంగా భక్తులు హాజరయ్యే వేడుక. ఈ మహా జాతరకు ఇతర రాష్ట్రాల నుంచి కూడా గిరిజన, గిరిజనేతర భక్తులు భారీ సంఖ్యలో హాజరవుతారు.

రెండేళ్ళకొకసారి తెలంగాణలోని ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో... సమ్మక్క-సారక్క జాతరను జరుపుతారు. ఇది చారిత్రక ప్రాధాన్యం ఉన్న సంబరం. పదమూడో శతాబ్దంలో... నేటి జగిత్యాల మండల ప్రాంతంలోని పొలవాస లేదా పొలస ప్రాంతాన్ని గిరిజన దొర మేడరాజు పరిపాలించేవాడు. ఆయన తన కుమార్తె సమ్మక్కను మేనల్లుడైన మేడారం పాలకుడు పగిడిద్దరాజుకు ఇచ్చి వివాహం చేశాడు. ఆ దంపతులకు సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం కలిగారు. రాజ్యవిస్తరణ కాంక్షతో... కాకతీయ ప్రభువైన మొదటి ప్రతాపరుద్రుడు పొలవాస మీద దండెత్తాడు. ఆ దాడిని తట్టుకోలేక మేడరాజు... మేడారంలో అజ్ఞాతవాసం గడిపాడు. మరోవైపు కాకతీయులకు సామంతుడైన పగిడిద్దరాజు కరువు కారణంగా కప్పం కట్టలేకపోయాడు. కప్పం కట్టకపోవడంతోపాటు మేడరాజుకు ఆశ్రయం ఇచ్చినందుకు ఆగ్రహించిన కాకతీయ ప్రభువు మేడారంపై మీద సైన్యంతో విరుచుకుపడ్డాడు. భీకరంగా జరిగిన యుద్ధంలో... మేడరాజు, పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, సారలమ్మ భర్త గోవింద రాజులు మరణించారు. ఈ వార్త విన్న జంపన్న సంపెగవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఆవాగు 'జంపన్నవాగు'గా ప్రసిద్ధి చెందింది.

మరోవైపు కాకతీయ సైన్యాన్ని సమ్మక్క వీరోచితంగా ఎదుర్కొని పోరాడింది. అయితే ప్రత్యర్థుల బలం ఎక్కువ కావడంతో... చివరికి ఆమె గాయపడింది. రక్తధారలతో యుద్ధభూమి నుంచి చిలుకలగుట్ట వైపు వెళ్తూ... మార్గమధ్యంలో అదృశ్యమయింది. సమ్మక్క కోసం ఆమె అనుచరులు వెతుకుతూ వెళ్ళారు. వారికి ఆమె కనిపించలేదు కానీ... ఒక పుట్ట దగ్గర పసుపు, కుంకుమ ఉన్న భరిణె దొరికింది. దాన్ని సమ్మక్కగా భావించి... రెండేళ్ళకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజున... సమ్మక్క-సారక్క జాతర నిర్వహిస్తున్నారు. వంశపారంపర్యంగా గిరిజనులే పూజారులుగా ఉంటారు. తమ కోర్కెలు తీర్చాలని అమ్మవార్లకు భక్తులు మొక్కుకుంటూ బంగారాన్ని (బెల్లాన్ని) నైవేద్యంగా సమర్పించుకుంటారు. వారి వీరత్వాన్ని స్మరించుకుంటారు.

వందల ఏళ్ళ చరిత్ర కలిగిన ఈ జాతరను నలభై వరకూ చిలకలగుట్ట మీద గిరిజనులు మాత్రమే నిర్వహించేవారు. ఆ తరువాత అన్ని వర్గాల ప్రజలూ పాల్గొంటున్నారు. జనసందోహం ఏటేటా పెరుగుతూ ఉండడంతో జాతరను కొండ కింద నిర్వహించడం మొదలుపెట్టారు. అమ్మవార్లకు చిహ్నంగా గద్దెలు ఏర్పాటు చేశారు. అమ్మవార్లకు ప్రతిరూపాలైన కుంకుమ భరిణెలను జాతర సందర్భంగా గద్దెపైకి తీసుకువస్తారు. ఈ నాలుగు రోజుల జాతరలో తొలిరోజున కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెపైకి తెస్తారు. ఆ మరునాడు చిలకలగుట్ట నుంచి సమ్మక్క గద్దెపైకి విచ్చేస్తుంది. మూడో రోజున భక్తులకు అమ్మవార్లు దర్శనమిస్తారు. చివరిరోజున అమ్మవార్లు తిరిగి వనప్రవేశం చేయడంతో జాతర ముగుస్తుంది.

ఫిబ్రవరి 21 : కన్నెపల్లి నుంచి సారలమ్మను, పునుగొండ్ల నుంచి పగిడిద్దరాజును, కొండాయి నుంచి గోవిందరాజును గద్దెలపైకి తీసుకువస్తారు.
ఫిబ్రవరి 22: చిలుకల గుట్ట నుంచి కుంకుమభరిణె రూపంలో ఉన్న సమ్మక్కను గద్దెపైకి తెస్తారు.
ఫిబ్రవరి 23: భక్తులు మొక్కులను చెల్లించుకుంటారు.
ఫిబ్రవరి 24: గద్దెలపై భక్తులకు దర్శనమిచ్చిన సమ్మక్క, సారలమ్మ వన ప్రవేశం.
ఫిబ్రవరి 28: తిరుగువారం పండుగ.



• నూతి శివానందం

సేయ్ కృష్ణ - నవద్వీపే శ్రీ చైతన్య చంద్ర
సేయ్ బలరామ - సంగే శ్రీ నిత్యానంద

"**శ్రీకృష్ణుడు** నవద్వీపంలో శ్రీ చైతన్య మహాప్రభువుగా అవతరించగా, వారితో పాటు బలరాముడు నిత్యానంద ప్రభువుగా అవతరించాడ"ని 'చైతన్య చరితామృతం' గ్రంథం చెబుతోంది. పశ్చిమబెంగాల్‌లోని ఏకచక్రధామంలో... 1473లో మాఘ శుద్ధ త్రయోదశి రోజున... హడాయ్ పండిత్, పద్మావతి దంపతులకు శ్రీనిత్యానంద జన్మించారు. ఆ రోజున ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది హరేకృష్ణ భక్తులు శ్రీనిత్యానంద త్రయోదశి మహోత్సవాన్ని (ఈ ఏడాది ఫిబ్రవరి 22న) నిర్వహిస్తారు. శ్రీనిత్యానంద ప్రభువు ఆవిర్భావం గురించి 'వాయుపురాణం'లో బ్రహ్మదేవుడికి శ్రీకృష్ణుడు వివరిస్తూ "నా ప్రప్రథమ పరివ్యాప్త స్వరూపుడు, నాతో అభిన్నుడు అయిన బలరాముడు కూడా నిత్యానందునిగా నాతోపాటు భూలోకంలో అవతరించి... అవధూత శిఖామణిగా ప్రకాశిస్తాడు" అని తెలిపాడు.

> ఆది గురుతత్త్వ స్వరూపమైన శ్రీనిత్యానందుల కృప లేనిదే... శ్రీచైతన్యుల కృపకు ఎవరూ పాత్రులు కాలేరన్నది పూర్వాచార్యుల అభిప్రాయం.

త్రేతాయుగాన లక్ష్మణుడిగా శ్రీరామచంద్రుణ్ణి సేవించిన బలరాముడే... కలియుగ ధర్మమైన హరినామ సంకీర్తనా ఉద్యమంలో శ్రీచైతన్య మహాప్రభువుకు తోడ్పడేందుకు శ్రీనిత్యానంద రామునిగా అవతరించారు. అయితే మునుపటి అవతారాలకన్నా ఇది ఎంతో ప్రత్యేకమైనది. ఎందుకంటే... కృష్ణనామాన్ని గానం చేస్తూ, దాన్ని ప్రపంచమంతటా వ్యాపింపజేయడానికి ఒక విశుద్ధ భక్తుడిగా అవతరించడం దీని విశిష్టత. సామాజికంగా ఉన్నతులైనా ఆధ్యాత్మికంగా శోచనీయమైన స్థితిలో ఉన్నవారిని శ్రీ చైతన్యులు ఉద్ధరించి, కొన్నివేల మంది మాయావాద సన్న్యాసులకు విశుద్ధ భక్తిమార్గాన్ని చూపిస్తే... జగాయ్, మాదాయ్ లాంటి మ్లేచ్ఛులపైన సైతం శ్రీనిత్యానందులు కరుణ చూపి, వారిని ఉద్ధరించారు. ఈ ప్రయత్నంలో తన ప్రాణాలకే ప్రమాదం వాటిల్లినా... వెనుకంజ వేయలేదు. పతితులైనవారి మనస్సులను తన అపారమైన కృపతో, ఔదార్యంతో గెలిచి... వారిలో పరివర్తన తీసుకువచ్చారు. ఒక విధంగా శ్రీచైతన్య మహాప్రభువుకు కూడా సాధ్యం కానిది శ్రీనిత్యానంద ప్రభువు సాధించారు. అంతేకాదు... ఏకచక్రపురంలోని బంకిమరాయ మందిరంలో ఉన్న బంకిమరాయ విగ్రహంలో... శ్రీనిత్యానంద ప్రభువు ఐక్యమై, తన లీలలను చాలించారన్నది ఐతిహ్యం. ఆ విగ్రహానికి కుడివైపున జాహ్నవీదేవి, ఎడమవైపున రాధారాణి విగ్రహం దర్శనమిస్తాయి. పరమపవిత్రమైన నిత్యానంద త్రయోదశినాడు... ఆదిగురుతత్త్వమైన శ్రీనిత్యానందుల్ని ఆశ్రయించి అనుసరిద్దాం. శ్రీనిత్యానందుల కృప వల్ల 'హరేకృష్ణ' మంత్రాన్ని జపించేందుకు మరింత శక్తి మనకు లభిస్తుంది.

అవధూత శిఖామణి





శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షుడు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9396956984

విశేషం

ప్రథమో హనుమన్నామః ద్వితీయో భీమ ఏవచ
పూర్ణ ప్రజ్ఞ తృతీయస్తు భగవత్కార్య సాధకః

హనుమ, భీమ అవతారాల తరువాత వైష్ణవతత్త్వ యదార్థ రూపాన్ని పునఃప్రతిష్ఠించడానికి వాయుదేవుడు శ్రీమధ్వాచార్యులుగా అవతరించాడు. ఈ మూడు అవతారాలకు భేదం లేదని మనం గ్రహించాలి. పరమాత్మ, లక్ష్మీదేవి తరువాత సకల దేవతలలో ఉత్తముడు వాయుదేవుడు. అందుకే హరి సర్వోత్తముడైతే... వాయువు జీవోత్తముడు.

వేదప్రతిపాదితమైన వాయుదేవుడి మూడు అవతారాలను... శ్రీమధ్వాచార్యుల శిష్యుడైన శ్రీత్రివిక్రమ పండితాచార్యులు ప్రత్యక్షంగా దర్శించారు. ఒక రోజు మధ్వాచార్యులు ఎప్పటిమాదిరిగానే శ్రీకృష్ణునికి పూజ చేసి, నైవేద్య సమర్పణకు సిద్ధమైనప్పుడు... ఆయన శిష్యులు ద్వాదశ స్తోత్రాన్ని పఠించారు. స్తోత్ర పఠనం పూర్తయింది. నైవేద్య సమర్పణ ముగిసే సమయం వచ్చినా... మధ్వాచార్యులు చేసే ఘంటానాదం ఎంతసేపైనా వినబడలేదు. 'ఎందుకింత ఆలస్యమవుతోంది? ఆచార్యులవారు ఏం చేస్తూ ఉంటారు?' అనే కుతూహలంతో త్రివిక్రమ పండితారాధ్యులు మూసి ఉన్న తలుపును కొద్దిగా జరిపి, సందులోంచి చూశారు. హనుమ, భీమ, మాధ్వ రూపాలతో శ్రీకృష్ణునికి తన గురువు పూజ చేస్తూ ఉండడం గమనించి... ఆనందాశ్చర్యాలతో మైమరచిపోయారు. ఏ తపస్సు చేసినా లభ్యం కాని ఆ అద్భుత దృశ్యాన్ని దర్శించి... ఆనందబాష్పాలు రాల్చారు. అప్రయత్నంగానే... సహజమైన శ్రేష్ఠకవిత్వశైలిలో శ్రీమధ్వాచార్యుల అవతారత్రయాన్ని, రామ, కృష్ణ, వ్యాసత్రయరూపాన్ని వర్ణిస్తూ 'శ్రీహరివాయుస్తుతి'ని జగత్తుకు అందజేశారు. అది విన్న మధ్వాచార్యులు ప్రసన్నులై... స్వయంగా 'నరసింహనఖస్తుతి'ని రచించి, 'శ్రీహరివాయుస్తుతి'ని పఠించే సజ్జనులకు పూర్ణఫలాన్ని అనుగ్రహించారు.



జ్ఞాన కార్యసాధకుడు

శ్రీమధ్వాచార్యులు బదరీ క్షేత్రానికి వెళ్ళి, నారాయణుణ్ణి దర్శించారు. తన మొదటి గ్రంథమైన 'గీతాభాష్యా'న్ని రచించి, బదరీనాథుడికి సమర్పించారు. అర్జునుడికి శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధిస్తున్నప్పుడు... కపిధ్వజుడిగా, భీముడిగా పూర్వావతారాల్లో ఆయన యుద్ధభూమిలో ఉన్నారు. అందుకే పరమాత్ముడే మెచ్చే విధంగా భగవద్గీతకు భాష్యం రాసే భాగ్యం ఆయనకు లభించింది.

శ్రీమధ్వాచార్యుల వ్యక్తిత్వం, తాత్త్వికత ఆయన రచించిన 37 గ్రంథాలలో సంపూర్ణంగా ప్రకటితమైంది. ఈ సంఖ్యలో మూడును, ఏడును కలిపి 'దశం' (పది)గా పరిగణిస్తారు. 'దశమతి' అంటే పూర్ణప్రజ్ఞులు... శ్రీ మధ్వాచార్యులు. అలాగే 'మూడూ ఇంటూ ఏడు' అంటే 21 అనేది మరో సంఖ్య. ఆనాడు మధ్వాచార్యులు తత్త్వవాదంతో పరిశీలించి, ఖండించిన సిద్ధాంతాల సంఖ్య అది. ఆయన బ్రహ్మసూత్రభాష్యం

> ఉడుపిలోని అనంతేశ్వర ఆలయంలో తన శిష్యులకు పాఠాన్ని బోధిస్తూ... అదృశ్యులై, వేదవ్యాసుని బదరికాశ్రమానికి శ్రీమధ్వులు చేరుకున్న రోజు... మాఘ శుద్ధ నవమి. దానినే సద్భక్తులందరూ 'మధ్వనవమి'గా జరుపుకొంటారు. ఆ పుణ్యదినాన శ్రీమధ్వాచార్యుల మహిమలను, ఆయన మానవాళికి అందించిన తత్త్వవాదాన్నీ శక్తి కొద్దీ స్మరిస్తే... శ్రీహరి కరుణకు పాత్రులవుతాము.

ఇరవై రెండవది. ఋగ్వేదంలోని ప్రథమ మండలంలో ఉన్న నలభై సూక్తాలకూ వేదార్థాల్ని వివరిస్తూ వ్యాఖ్యానం రాసి, వేదంలోని ప్రతి శబ్దార్థమూ శ్రీమహావిష్ణువును ఉద్దేశించినదేని మధ్వాచార్యులు నిరూపించారు. వేద, ఉపనిషత్తులలోని పరమాత్ముని తత్త్వజ్ఞాన సందేశాన్ని ప్రపంచానికి అందజేశారు.

• మధ్వ ప్రచార పరిషత్, 9440258841

వన్ డిస్ట్రిక్... వన్ ఎగ్జిబిషన్‌కు విద్యార్థిని ఎంపిక


పరికరంతో విద్యార్థిని వినీల

గంభీరావుపేట, ఫిబ్రవరి 15: మండలంలోని దమ్మన్నపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని పొన్నాల వినీల వన్ డిస్ట్రిక్, వన్ ఎగ్జిబిషన్‌కు ఎంపికైంది. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఇంటింటా ఇన్నోవేటర్ 2023 కార్యక్రమంలో అద్భుత ప్రతిభ చూపి ఉత్తమ ఇన్నోవేటర్ అవార్డుతో పాటు గ్రామీణ ఇన్నోవేటర్‌గా వినీల అవార్డును అందుకుంది. దమ్మన్నపేట ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదవుతున్న వినీల టీఎస్ఐసీ ఆధ్వర్యంలో 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు నిర్వహించిన వన్ డిస్ట్రిక్, వన్ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి వినీ ల ఎంపికైంది. గైడ్ టీచర్ తాడూరు సంపత్‌కుమార్ మార్గదర్శనలో తయారు చేసిన మహిళ వంట మిత్ర అనే ఆవిష్కరణను, భద్రాద్రి, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లా కేంద్రాల్లోని కలెక్టర్ కాంప్లెక్స్‌లలో నిర్వహించే కార్యక్రమాల్లో వినీల ప్రదర్శించనుంది.

రాష్ట్రంలో ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లోనే ప్రభుత్వ పాలన

- బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకని భాను

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 15 : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లోనే రాష్ట్ర ప్రభుత్వ పాలన కొనసాగిస్తోందని, దీనికి జన్వాడలో జరిగిన సంఘటననే నిదర్శనమని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంకని భాను అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా జన్వాడలో జరిగిన హింసాత్మక సంఘటనలో బాధితుల పక్షాన సంఘీభావం తెలుపడానికి వెళ్లిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం అరెస్ట్ చేయించిన విధానాన్ని ఖండిస్తున్నామన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి చేకూర్చుకునేందుకు మతతత్వ రాజకీయ హింస కార్యక్రమాలకు కొన్నిశక్తులు పాల్పడుతున్నాయని, వాటిని నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా బాధితుల పక్షాన సంఘీభావాన్ని తెలపడానికి వెళ్లిన రాష్ట్ర అధ్యక్షుడితోపాటు నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడం సరైందికాదన్నారు. జన్వాడలో సంఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు వరదవెల్లి స్వామిగౌడ్, రాష్ట్ర కార్యదర్శి ఎనగందుల వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి బోద్దు మహేందర్, జిల్లా కార్యదర్శి అరుకుల రమేష్, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు లింగంపల్లి మధుకర్, మేర్గు రాజు, సగ్గు పాటి నరేష్, బందెల దేవరాజు, పట్టణ అధ్యక్షుడు తడుక భాను, గుంటుకు రమేష్, మేర్గు శ్రీనివాస్ , గడ్డం కమాలకర్, గుండు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశానికి మోదీ.. కరీంనగర్‌కు బండి..


గ్రామస్థులతో మాట్లాడుతున్న రాణి రుద్రమ

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 15: దేశానికి మోదీ .. కరీంనగర్‌కు బండి సంజయ్ కావాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమ అన్నారు. గావ్ చలో..బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి తంగళ్లపల్లి మండలం అంకిరెడ్డిపల్లె గ్రామంలో రాణి రుద్రమ బస చేశారు. గురువారం ఉదయం హనుమాన్ ఆలయాన్ని దర్శించుకుని అనంతరం గ్రామంలో కలియ తిరిగారు. బీజేపీ ప్రచార కార్యక్రమంలో భాగంగా గోడకు కమలం బొమ్మ గీసి దేశానికి మోదీ కావాలని, కరీంనగర్‌కు బండి సంజయ్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ రాగుల రాజిరెడ్డి , కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాతలకు కాంగ్రెస్ పార్టీ అండ

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అన్నదాతలకు అండగా నిలుస్తామని రాహుల్‌గాంధీ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలోని నాయకులు, రైతులకు గురువారం మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రైతులను అణిచి వేస్తు అన్యాయం చేస్తోందని అన్నారు. అన్నదాతలను ఆదుకోవాల్సిన సర్కారు కనీస మద్ధతు ధర కల్పించకపోవడం శోచనీయమని అన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు కనీస మద్దతు ధర కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో నర్సయ్య, లక్ష్మారెడ్డి, లింగాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, దేవయ్య, బుచ్చాగౌడ్, మల్లారెడ్డి, రాజేందర్, రఫీక్, బాబు, రాంరెడ్డి పాల్గొన్నారు.

మత్తు పదార్థాల విక్రయాలను అడ్డుకుంటాం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15: పల్లెల్లో మత్తు పదార్థాల విక్రయాలను అడ్డుకుని మత్తు నిషేధిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రత్యేక అధికారులు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు గొల్లపల్లి, బొప్పాపూర్, వెంకటాపూర్, నారాయణపూర్, బండలింగంపల్లి, రాజన్నపేట, తిమ్మాపూర్, కోరుట్లపేట, తదితర గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సభలను నిర్వహించారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరించారు. యువత పెడదోవ పట్టకుండా తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. గొల్లపల్లి, బొప్పాపూర్, నారాయణపూర్, వెంకటాపూర్ గ్రామాల్లో మద్యం, సారా, గంజాయి అమ్మకాలు సాగిస్తే జరిమానాలు విధిస్తామని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రాధాకృష్ణుల కల్యాణం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని గీతామందిరం వార్షికోత్సవం కొనసాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం పరమహంస పరివ్రాజకాచార్యులు, మధుసూదనానంద సరస్వతిస్వామి ఆధ్వర్యంలోని వేద పండితులు రఘురామశర్మ, విద్యాధరశర్మ, రామచంద్రశర్మ, రవీందర్‌శర్మ, నరహరి శర్మ, రాముశర్మ, సందీప్‌శర్మలు కుంభాభిషేకం, తదితర పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం రాధాకృష్ణుల కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కనులారా తిలకించారు. సాయంత్రం స్వామి వారి రథంపై గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. మహిళలు మంగళహారతులు సమర్పించి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల్లోని గ్రామాలకు చెందిన భక్తులు బారీ సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో సత్సంగ సదనం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, గీతామందిరం సభ్యులు విశ్వనాథం, రాంరెడ్డి, శ్రీకర్, రాజేశం, సత్తయ్య, శ్రీనివాస్‌రెడ్డి, లలితమ్మ, సుజాత, మంజుల, రజిత, పద్మ, ప్రసన్న, నిర్మ, అనిత, పద్మ, శంకరవ్వ పాల్గొన్నారు.

యువకులపై సస్పెక్ట్‌షీట్ ఓపెన్

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 15: మండలంలో పలు కేసుల్లో నిందితులైన యువకులపై సస్పెక్ట్‌షీట్ ఓపెన్ చేసినట్లు ఎస్సై దాస సుధాకర్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. గంజాయి కేసులలో నిందితులయిన రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన మంతెన శ్రీకాంత్, పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన కురెళ్ళ వంశీ, ఇల్లంతకుంటకు చెందిన దొమ్మాటి అరవింద్, దొమ్మాటి వంశీ, దొంగతనం కేసులో నిందితులయిన తిప్పాపూర్ గ్రామానికి చెందిన కొడిముంజ రాజమౌళి, కొడిముంజ తిరుపతి, హత్య కేసులో నిందితుడైన దాచారం గ్రామానికి చెందిన దరిపెళ్ళి వంశీలపైన సస్పెక్ట్‌షీట్ ఓపెన్ చేసినట్లు తెలిపారు. మండలంలో ఎవరైన నేరాలు చేసినట్లయితే వారిపై కూడా సస్పెక్ట్‌షీట్ ఓపెన్ చేస్తామని ఎస్సై పేర్కొన్నారు.

చర్చి నిర్మాణానికి అనుమతి ఇవ్వవద్దు

చందుర్తి, ఫిబ్రవరి 15: ఇంటి నిర్మాణం పేరిట చర్చి నిర్మాణానికి అనుమతి ఇవ్వవద్దని తిమ్మాపూర్ గ్రామస్థులు తీర్మానించారు. చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామ ప్రత్యేక అధికారి శాంతయ్య అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని వివిధ కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ గ్రామంలో ఇతర గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు చర్చి నిర్మాణం చేపట్టి మతమార్పిడి చేయాలనే ఉద్దేశంతోనే ఇంటి నిర్మాణం పేరిట చర్చి నిర్మాణం చేపడుతున్నారన్నారు. గతంలోని చర్చి నిర్మాణం కోసం పనులు చేపట్టగా తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి అడ్డుకున్నామన్నారు. గ్రామంలో క్రిస్టియన్లు లేరని, ఇల్లు నిర్మాణం పేరిట చర్చి నిర్మాణానికి అనుమతి ఇవ్వవద్దన్నారు. గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి వినోద, నాయకులు లక్ష్మీపతి, నల్లపు దివాకర్, రామిడి మల్లయ్య, గడికొప్పుల పోషవ్వ, పిట్టల చంద్రయ్య, అజీమ్, శ్రీనివాస్, మహేష్, కుల సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాత్రిపూట గస్తీ కాయాలి: సీఐ

కోనరావుపేట, ఫిబ్రవరి 15: రాత్రి పూట యువత గస్తీ కాయాలని చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మర్తనపేట గ్రామంలో గురువారం రక్షక దళాలను ఏర్పాటు చేసి వారికి కర్రలను అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని అన్నారు. యువత రాత్రిపూట గస్తీ తిరుగుతూ మన గ్రామాన్ని మనమే కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అంజనేయులు, ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జవ్వాజి తిరుపతిగౌడ్, యువకులు పాల్గొన్నారు.

పొలాల వద్ద విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తే చర్యలు

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 15: వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ కంచెలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. గురువారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. వన్యప్రాణుల వేట కోసం విద్యుత్ తీగలు ఏర్పాటుచేసి ప్రజల ప్రాణాలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. ఇలాంటి అక్రమ విద్యుత్తు తీగలు అమర్చితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. జిల్లాలో అడవి జంతువులను వేటాడానికి విద్యుత్ తీగలను అమర్చినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పదిరె గ్రామానికి చెందిన దొంతరవేణి విజయ్, కుర్ర బాస్కర్ కరెంటు వైర్‌తో విద్యుత్ కనెక్షన్ తీసుకొని మానేరు నది చెక్ డ్యాంలో చేపలు పడుతున్నారని, వీరిని వెంటనే అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. రుద్రంగి మండలకేంద్రానికి చెందిన గుగులోతు తిరుపతి అనే వ్యక్తి పంట చేను వద్ద అడవి జంతువుల వేట కోసం పెట్టిన విద్యుత్ కంచెకు తగిలి ఓ గేదే మృతి చెందిందన్నారు. ఈ సంఘటనలో తిరుపతిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కోనరావుపేట మండలంలోని మర్రిమడ్ల గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి గేదె పశుగ్రాసం మేస్తుండగా నాటు బాంబు పేలి గాయపడిందని, ఈ సంఘటనపై కేసు నమోదు చేశామన్నారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. కోనరావుపేట మండలంలో గత ఏడాది వన్యప్రాణుల కోసం విద్యుత్ తీగలు అమర్చి ఓ వ్యక్తి మృతికి కారణం అయిన వ్యక్తిపై పీడీ యాక్ట్ అమలు చేశామన్నారు. జిలెటిన్ స్టిక్స్, పేలుడు పదార్థాలు, ఎవరైనా నిల్వ ఉంచుకున్నా, ఎవరి దగ్గరైనా ఉన్నాయన్న సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కి కాల్‌చేసి దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

● ప్రాణాలు కాపాడటంలో సీపీఆర్ కీలకం..

ప్రాణాలు కాపాడటంలో సీపీఆర్ ప్రథమ చికిత్స కీలకమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లాలోని పోలీసు అధికారులకు, సిబ్బందికి సీపీఆర్, ప్రథమ చికిత్స అండ్ బేసిక్ లైఫ్ సపోర్ట్ దాని ప్రాముఖ్యంపై మెడిలైఫ్, రేనే ఆస్పత్రుల వైద్య బృందంతో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చాలా సార్లు రోడ్డుపై అకస్మాత్తుగా గుండెపోటు కారణంగా ప్రజలు మరణిస్తున్నారన్నారు. ఇలాంటి సమయాల్లో శిక్షణ పొందిన బ్లూ కోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది, పోలీసు అధికారులు ఒక ప్రాణాన్ని రక్షించడంలో సహాయ పడతారన్నారు. సీపీఆర్, ప్రథమ చికిత్స బేసిక్స్ లైఫ్ సపోర్ట్ గురించి తెలుసుకుంటే విధినిర్వహణలో భాగంగా సామాన్య ప్రజలకు మెడికల్ ఎమర్జెన్సీలు సంభవించినపుడు సాధ్యమైనంత వరకు వారి ప్రాణాలు కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. శిక్షణలో భాగంగా బొమ్మపై లైఫ్ సపోర్ట్ స్కిల్స్‌పై వైద్యులు ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. శిక్షణా కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, డాక్టర్లు కుమారస్వామి, దీక్షిత్, వంశీ, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, పక్కన ఎస్పీ

● సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి..

గంభీరావుపేట: సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తులపై, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని కేజీటూపీజీ ఆవరణలో గురువారం విద్యార్థినులకు షీ టీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఉమెన్ సేఫ్టీ, మహిళల రక్షణ చట్టాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్, సోషల్ మీడియా సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన షీ టీం విద్యాసంస్థలు, బస్టాండ్‌లు, మహిళలు పనిచేసే ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో పోకిరీలపై నిఘా ఉంచుతామన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులు సందేశాలపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ నేరాల బారిన పడి ఎవరైన తమ అకౌంట్ నుంచి డబ్బులు పోగొట్టుకున్నట్లైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రామ్మోహన్, షీ టీం ఏఎస్ఐ ప్రమీల, సిబ్బంది ఉన్నారు.

● గంభీరావుపేట ఠాణా తనిఖీ

గంభీరావుపేట: గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ అఖిల్ మహాజన్ గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అన్ని స్థాయిల సిబ్బందితో మాట్లాడి వారి నిర్వహిస్తున్న విధులను తెలుసుకున్నారు. రిసెప్షన్‌లో ఎలాంటి ఫిర్యాదులు వస్తున్నాయో తెలుసుకోవడంతో పాటు పరిష్కారం కోసం తీసుకుంటున్న చర్యలను అడిగారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, 5ఎస్ ప్రోగ్రాంలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేసుకోవాలన్నారు. స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. నేరాల ఛేదన, నియంత్రణలో కీలక పాత్ర పోషించే సీసీ కెమెరాల పనితీరును ప్రతీరోజు పరిశీలించాలన్నారు. అక్రమ కార్యాకలాపాలపై ఉక్కుపాదం మోపేందుకు నిరంతరం తనిఖీలు, దాడులను కొనసాగించాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ శశధర్‌రెడ్డి, ఎస్ఐ రామ్మోహన్ సిబ్బంది ఉన్నారు.


పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ

పారిశుధ్య సిబ్బంది పనితీరు భేష్

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 15: పారిశుధ్య సిబ్బంది పనితీరు భేషుగ్గా ఉందని ఎంపీపీ పడిగెల మానస రాజు అన్నారు. గురువారం తంగళ్లపల్లి మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి మత్తు పదర్థాలతో జరిగే అనర్థాలు తదితర అంశాలపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా తంగళ్లపల్లి గ్రామసభకు హజరైన ఎంపీపీ మాట్లడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. పారిశుధ్య కార్మికులను సన్మానించడం సంతోషకరం అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీటీ సీ కోడి అంతయ్య, ప్యాక్స్ వైస్‌చైర్మన్ ఎగుమామిడి వెంక టరమణరెడ్డి, ఏఎస్ఐ సాంబశివరావ్, కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 15: మండలంలోని మండేపల్లి, రాళ్లపేట, ఒబులాపూర్, ఇందిరమ్మకాలనీ, సారంపల్లి, పద్మనగర్, తాడురు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు జడ్పీటీసీ పుర్మాణి మంజుల లింగారెడ్డి గురువారం భూమిపూజ చేశారు. మండేపల్లి సీసీ రోడ్డు నిర్మాణం, రాళ్లపేటలో అంగన్‌వాడీ భవన నిర్మాణం, ఒబులాపూర్‌లో సమ్మక్క సారమ్మ ఆలయం వద్ద తాగునీటి కోసం బోరుబావి, ఇందిరమ్మకాలనీలో అంగన్‌వాడీ భవన నిర్మాణం, సారంపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణం, పద్మనగర్ గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణం మిగులు పనులకు, తాడురులో సీసీ రోడ్డు, గౌడ సంఘం భవన నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్, నాయకులు వైద్య శివప్రసాద్, మునిగెల రాజు, లింగాల భూపతి, పొన్నాల పర్శరాములు, సుద్దాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి


మోత్రాపూర్‌తండా, బావుసింగ్ నాయక్ తండా, దసరా నాయక్ తండాలో వేడుకల్లో పాల్గొన్న గిరిజనులు, నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15: జిల్లాలోని వివిధ మండలాల్లో గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండా, బాకురుపల్లి తండా, దేవునిగుట్టతండా, గుండారం, తదితర గిరిజన గ్రామాల్లో వేడుకలను నిర్వహించారు. భక్తిశ్రద్ధల నడుమ ప్రత్యేక పూజలు జరిపి భోగ్ బండార్‌ను జరిపించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, తండా పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని జగదాంబతండలో బంజారా సేవా సమితి ఆధ్వర్యంలో సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బంజారా సేవలాల్ సేవ సమితి అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, నాయకులు బాల్యానాయక్, అర్జున్‌నాయక్, బిక్‌నాయక్, భరత్‌నాయక్, విఠల్, సురేందర్, బీంలానాయక్, రమేష్, పంతుల్యానాయక్, దేవేందర్, కిణన్, కవిత, సునీత ఉన్నారు.

ముస్తాబాద్: మండలంలోని మోత్రాపూర్‌లో సేవాలాల్ ఆలయ ఆవరణలో గిరిజనులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాది కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో గిరిజనులు బాబు, గోవర్ధన్, సంజీవ్, కఫూర్, గణ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: గిరిజనుల ఆరాధ్య దైవం సంతూ సేవాలాల్ మహరాజ్ అని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. వీర్నపల్లి మండలంలోని ఆయా తండాల్లో సేవాలాల్ జయంతి ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని బావుసింగ్ నాయక్ తండా గ్రామంలో జడ్పీటీసీ గుగ్లోతు కళావతితో కలిసి తోట ఆగయ్య భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, బంజార సం ఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుగులోత్ సురేశ్‌నాయక్, మాజీ సర్పంచ్ భూక్య భారతి, పాటి దినకర్, గిరిజన సంఘ నేతలు శ్రీరాంనాయక్, తులసీ రాం, లింగమూర్తి, రాములు, దర్సింగ్, లింబ్యా, హరిదాస్, మదన్ పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండలంలో సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రం శివారులోని దసరా నాయక్ తండాలో సేవాలాల్ మహరాజ్ జయంతి సందార్భంగా సేవాలాల్ మహరాజ్‌కు ఉదయం నుంచి పూజరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గామస్థులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషిచేయాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్ ప్రేమలత

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 15: పెండింగ్ కేసుల పరిష్కారానికి బాధ్యతగా కృషిచేయాలని న్యాయసేవాధికార సంస్థ చైర్మెన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్. ప్రేమలత అన్నారు. జిల్లా కోర్టు హాలులో గురువారం పెండింగ్ కేసులపై అన్ని పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 9న జరిగే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరిస్తూ కేసుల సంఖ్య తగ్గించాలన్నారు. కొత్తకేసులతో పాటు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించి కేసుల సంఖ్య తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు పనిచేయాలన్నారు. జిల్లాలో పెండింగ్ కేసుల పరిష్కారంలో మంచి ఫలితాలు సాధిస్తున్నామన్నారు. ఇందుకోసం కేసుల పురోగతిపై అధికారులంతా చురుకుగా పనిచేయాలన్నారు. జిల్లాలో రాజీకి అవసరమైన క్రిమినల్ కేసుల పరిష్కారంలో శ్రద్ధ చూపాలన్నారు. జిల్లాలోని 13పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 850 కేసులు పెండింగ్ ఉన్నాయని, వీటిలో కనీసం 280కేసులు పరిష్కారానికి మార్గం చూడాలన్నారు. ఆయా పోలీస్‌స్టేషన్‌ల వారీగా కేసుల పరిష్కారానికి లక్ష్యాన్ని నిర్దేశించారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీలేఖ, ప్రిన్సిపల్‌జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్, జూనియర్ సివిల్ జడ్జిలు జ్యోతిర్మయి, కావేటి సృజన, వేములవాడ డిఎస్పీ నాగేంద్రచారి , సిరిసిల్ల, వేములవాడ టౌన్ సిఐలు రఘుపతి, కరుణాకర్, ఏపీపీలు సందీప్, పెంట శ్రీనివాస్‌లుఅన్ని పోలీస్‌స్టేషన్‌ల ఎస్ఐలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్ ప్రేమలత

ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి సహకారం

- ఎంపీ బండి సంజయ్‌కుమార్

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 15: తంగళ్లపల్లి ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి సతిహాయ సహకారాలు అందిస్తానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ నిర్మాణంలో తన తోడ్పాటు తప్పకుండా ఉంటుందన్నారు. ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు దొంతుల అంజనేయులు, రంగు శ్యాం, ఉపాధ్యక్షుడు సిరిపాక ప్రణయ్, కార్యదర్శి దుబ్బాక రాజు ఆధ్వర్యంలో సభ్యులు వినతిపత్రాన్ని ఎంపీకి సమర్పించారు. నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే భవన నిర్మాణానికి సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. జడ్పీటీసీ పుర్మాణి మంజుల లింగారెడ్డి బోరుబావి, మోటర్ కోసం రెండు లక్షల రూపాయలు మంజూరు చేశారు. ఎంపీటీసీ కోడి అంతయ్య మండల నిధుల నుంచి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేస్తూ ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ఎంపీపీ పడిగెల మానస రాజు రూ.1.10 లక్షలు, వైస్‌ఎంపీపీ జంగిటి అంజయ్య రూ. లక్ష మండల పరిషత్ నిధులు మంజూరు చేస్తూ ప్రొసిడింగ్‌లు అందజేశారు.

కార్యక్రమంలో సెస్ చైర్మన్ చిక్కాల రామరావ్, నాయకులు రెడ్డబోయిన గోపి, వైద్య శివప్రసాద్, జల్గం ప్రవీణ్, సత్తు శ్రీనివాస్‌రెడ్డి, ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, పెద్దూరి తిరుపతి, సుద్దాల శ్రీనివాస్, ఎగుర్ల ప్రశాంత్, లింగాల భూపతి, అంకారపు రవీందర్, జంగిటి అంజయ్య, పొన్నాల పర్శరాములతో పాటు ప్రెస్‌క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రావిడెంట్ ఫండ్ సమస్యలు పరిష్కరించాలి

- జడ్పీ సీఈవోకు విన్నవించిన టీపీటీఎఫ్ జిల్లా నాయకులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 15: ప్రావిడెంట్ ఫండ్ సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల భూపాల్‌రెడ్డి, దుమాల రామానాథ్‌రెడ్డి కోరారు. సిరిసిల్ల జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం నూతనంగా విధుల్లో చేరిన జడ్పీ సీఈవో ఉమరాణిని టీపీటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మార్యదపూర్తకంగా కలిసి సంఘం డైరీని అందించారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాకు పంపిన ఉపాధ్యాయుల అకౌంట్ వివరాలను అన్‌లైన్ చేయడాన్ని స్వాగతిస్తున్నామని కానీ ఇంకా కొన్ని సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని వివరించారు. కుటుంబ అవసరాల నిమిత్తం దరఖాస్తులు చేసుకున్న రుణాలు, పార్ట్ ఫైనల్ చెల్లింపులు ఇప్పటికి వరకు కొత్త జిల్లా నుంచి చెల్లించడంలేదన్నారు. దీనివలన ఉపాధ్యాయులు అర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. కరీంనగర్ నుంచి వేరు పడిన జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలో అకౌంట్‌ల వివరాలను పూర్తిగా అన్‌లైన్ చేశారని అర్థిక చెల్లింపులు జరుగుతున్నాయని అన్నారు. ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉపాధ్యాయుల వివరాలను తక్షణమే అయా జిల్లాలకు పంపించాలని, అకౌంట్ వివరాలను అన్‌లైన్ చేయాలని రుణాలు, పాక్షిక మినహాయింపులని తక్షణమే మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో మచ్చ గీత, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్, జిల్లా కార్యదర్శి డబ్బెడ హనుమాండ్లు, బూస రాజేందర్, దరిపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


జడ్పీ సీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

వైజ్ఞానిక చైతన్యానికి స్ఫూర్తినిచ్చిన ఆది నారాయణ

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 15: వైజ్ఞానిక చైతన్యానికి స్ఫూర్తినిచ్చి, వైజ్ఞానిక అభివృద్ధికి తపన పడే వ్యక్తి సామాజిక రుగ్మతల నిర్మూలనకు సైన్సే అస్త్రంగా ముందుకు నడిపించిన వ్యక్తి ఆది నారాయణ అని రంగినేని ట్రస్టు అధినేత రంగినేని మోహన్‌రావు అన్నారు. జనవిజ్ఞాన వేధిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రగుడు శివారులోని రంగినేని ట్రస్ట్‌లో గురువారం సాయంత్రం ఇటీవల మరణించిన జనవిజ్ఞాన వేధిక రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఆదినారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమటి సభ్యులు సీ రామరాజు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుర్రం అంజనేయులు, సంపతి రమేష్, మార్వాడి గంగరాజు, కళ్యాణి, శ్రీహరి, పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 15: మండలంలోని రేపాక, సోమారంపేట గ్రామాలలో గురువారం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. పారిశుధ్య వారోత్సవాల ముగింపు సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన సమావేశాలలో ప్రత్యేకాధికారి రమేష్ మాట్లాడుతూ గ్రామాలు నేడు పరిశుభ్రంగా ఉంటున్నయంటే పంచాయితీ సిబ్బందే కారణం అన్నారు. పారిశుధ్య కార్మికులను ప్రతీ ఒక్కరు గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాథ సుమలతమల్లేశ, పంచాయితీ కార్యదర్శులు, కార్మికులు పాల్గొన్నారు.

ఎంపీడీవో సత్తయ్యకు సన్మానం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 15: ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సత్తయ్యను స్థానిక కార్యాలయ సిబ్బందితో పాటు పలువురు నాయకులు గురువారం సన్మానించారు. ఎల్లారెడ్డిపేట మండల పరిషత్తు కార్యాలయంలో ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. మండలాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీడీవో సత్తయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో వజీర్‌అహ్మద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

చందుర్తి, ఫిబ్రవరి 15: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆర్‌బిఎస్‌కే వైద్యులు ప్రభాకర్ అభినయ అన్నారు. చందుర్తి మండలం మూడపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే వైద్యబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం రక్తపోటు నిర్ధారణ పరీక్షలు, అనీమియా ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న విద్యార్థులకు ఐరన్, విటమిన్ మాత్రలు పంపిణీ చేశారు. రక్తహీనతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దేవలక్ష్మి, సంధ్య, ఆశ స్రవంతి పాల్గొన్నారు.